క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): షూటింగ్ బాల్ పోటీలలో నంద్యాల జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరచాలని జిల్లా ప్రాధికార సంస్థ శిక్షకుడు రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శివకుమార్, స్టేట్ కోఆర్డినేటర్ విశ్వనాథ, జిల్లా వ్యాయామ అసోసియేషన్ బత్తుల రవికుమార్ అన్నారు. గురువారం నంద్యాల ఎస్పీజీ క్రీడా మైదానంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు జరిగాయి. పోటీల్లో 70మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు పీలేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమర్, సెక్రెటరీ పరమేశ్వర రెడ్డి, ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలకు సిద్ధం



పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

ఉయ్యాలవాడ : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాల ద్వారా సాకారం అవుతోంది. మండలంలోని కొండుపల్లె గ్రామంలో రూ. 42 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనం తుది మెరుగులు దిద్దుకుంటోంది. త్వరలో భవనాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలు అందేంచేలా నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ రామక్రిష్టారెడ్డి తెలిపారు. భవనాన్ని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేయడానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రేపు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, హాకీ టెన్నిస్, వాలీబాల్, ఒక్కొక్క క్రీడకు 30 మంది బాలుర చొప్పున ఈనెల 30న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్యశిక్షకులు రాజు గురువారం తెలిపారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు 30-09-2005 నుంచి 30-09-2011 మధ్య పుట్టిన వారు అర్హులన్నారు. 2022-23, 2023-24లో గతేడాది క్రీడా సమాఖ్య నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో మొదటి 8 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే విశ్వవిద్యాలయ పోటీల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాకారులకు, రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర క్రీడా సంఘాలచే ఎంపికైన మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9885240365ను సంప్రదించాలన్నారు.

స్కిల్ హబ్‌పై శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ కేంద్రంలో పైతాన్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ, స్కిల్‌హబ్ నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కోర్సుకు డిగ్రీ, బీటెక్‌లో కంప్యూటర్ చదివిన వారు అర్హులన్నారు. ఈనెల 29న ప్రాథమిక పరీక్ష ద్వారా 30మంది యువతీ యువకులను శిక్షణకు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మస్తాన్‌వలి సెల్ : 8297812530కు సంప్రదించాలన్నారు.

1న టెన్నిస్ బాల్ క్రికెట్ ఎంపిక పోటీలు

ఆళ్లగడ్డ : అండర్- 14 బాల, బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు అక్టోబర్ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ మధుఈశ్వరి గురువారం తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరగనున్న ఈ ఎంపిక పోటీలకు 1-1-2010 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైనవారు అక్టోబర్ 16, 17 తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలల్లో పాల్గొంటారన్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

గోస్పాడు: మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీని రాష్ట్ర కౌన్సిలర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా కైపా ప్రతాపరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా దీపక్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా జయసుధ, కార్యదర్శులుగా బాబు, శివనాగిరెడ్డి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తలుపు తట్టి.. నాడి పట్టి

- పేదల ఆరోగ్యంపై ప్రభుత్వ చిత్తశుద్ధి
- కొత్త పుంతలు తొక్కుతున్న వైద్య సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్య సిబ్బంది
- ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు
- ముమ్మరంగా ఆరోగ్య సర్వే
- ఈ నెల 30 నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లతో మెడికల్ క్యాంపులు



నల్లగట్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



గోస్పాడు మండలం ఒంటివెలగలలో వృద్ధురాలికి రక్తపరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ/గోస్పాడు: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని తేలిగ్గా తీసుకుని వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి కొంత వ్యాధి ఏమిటో తెలుసుకోకుండా అస్వస్థతకు లోనైనప్పుడు ఏదో ఒక మాత్ర వేసుకుని వ్యాధి ముదిరే వరకు ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి అటువంటి వారికి స్పెషలిస్ట్ వైద్యులతో ప్రత్యేక వైద్యం అందించాలని సంకల్పించింది. సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వాధ్యులను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు..

ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారు. ఈ నెల 29 వరకు సర్వే కొనసాగుతుంది. ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ అందజేస్తున్నారు. ఆ కుటుంబంలోని వ్యక్తి సెల్‌ఫోన్‌లో జగనన్న సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసి సర్వే వివరాలు అందులో అప్‌లోడ్ చేస్తున్నారు. కొన్ని పరీక్ష (బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, గళ్ల)లను ఇంటి వద్దనే చేస్తారు. ఈ పరీక్షలో గుర్తించిన వ్యాధులకు అవసరమైన మందులను అందజేస్తారు. అనంతరం గ్రామాల్లో జరిగే మెగా వైద్య శిబిరాలలో మరలా వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారిని ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు.

30 నుంచి వైద్య శిబిరాలు

ఈ నెల 30 నుంచి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చే నెల 2వ తదీ వరకు 81 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. గోస్పాడు మండలంలో ఒంటివెలగల, ఎస్.కూలూరు, రాయపాడు గ్రామాలకు సంబంధించి ఈనెల 30న ఒంటివెలగలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. అలాగే వచ్చేనెల 3వ తేదీన ఎం.కృష్టాపురం, 4న పసురపాడు, 5న జూలేపల్లె, 6న యాళ్లూరు-1, 7న దీబగుంట్ల, 10న నెహ్రూనగర్, 11న సాంబవరం, 12న కానాలపల్లె, ఎస్.నాగులవరం, 17న యాళ్లూరు-2 గ్రామాల్లో వైద్య సేవలు అందించనున్నారు.

జగనన్న సురక్షలో భాగంగా ఇప్పటి వరకు నిర్వహించిన వైద్య పరీక్షలు

ఆళ్లగడ్డ నియోజకవర్గలో బీపీ - 17,299, షుగర్ - 14,851, రక్త పరీక్షలు - 17,739, మూత్ర పరీక్షలు - 879, మలేరియా - 579, డెంగీ - 460, గల్ల పరీక్షలు - 352 చేశారు. గోస్పాడు మండలంలో బీపీ పరీక్షలు - 865, షుగర్ పరీక్షలు- 724, హిమోగ్లోబిన్ - 767, యూరిన్ టెస్టులు- 16, మలేరియా -12, డెంగీ - 9, గళ్ల పరీక్షలు - 17, మొత్తం - 2410 పరీక్షలు నిర్వహించారు.

ధైర్యం వచ్చింది



వయస్సు పైబడటంతో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు కీళ్ల నొప్పులు విపరీతంగా వచ్చి నడవలేక పోతున్నాను. ఇంటి దగ్గరకే వచ్చి అన్ని పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇప్పుడు పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేస్తారని రసీదు ఇచ్చి పోయారు దీంతో నాకు ఆరోగ్యంపై ధైర్యం వచ్చింది.

– ఓబులంపల్లె హుస్సేన్‌బీ,కోటకందుకూరు

సీఎం రుణం తీర్చుకోలేం



బీపీ ఎక్కువై మెదడులో నరాలు చిట్టిపోయాయి. కర్నూలుకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు మా ఊరుకే నరాల స్పెషలిస్ట్ వచ్చి పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఉచితంగా ఆసుపత్రికి తీసుకు పోయి వైద్య సేవలు చేస్తారని చెప్పి టోకెన్ ఇచ్చారు. సీఎం రుణం తీర్చుకోలేం.

– వడ్ల రమణయ్య, ఆర్ కృష్టాపురం

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి ఆరోగ్య సర్వేలో వైద్య పరీక్షలు నిర్వహిస్తు న్నారు. ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుంటే వ్యాధులు నిర్ధారణైతే మెరుగైన వైద్య సేవలు పొందేందుకు వీలవుతుంది.

– గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

వాహనమిత్ర సమావేశానికి హాజరు కావాలి

నంద్యాల(అర్బన్): కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే వాహన మిత్ర సమావేశానికి నంద్యాల జిల్లా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సష్ యూనిట్) ఆపరేటర్లు తప్పక హాజరు కావాలని జిల్లా అధ్యక్షుడు ఖాజా శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఎండీయూలను వాహన మిత్రలో చేర్చడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ఉయ్యాలవాడ : చదువుతో పాటు విద్యార్థులను క్రీడా రంగంలో రాణించేందుకు ప్రభుత్వం క్రీడలకు అవసరమైన సామగ్రిని అందజేస్తోందని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆదామ్‌కు క్రీడా సామగ్రిని అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక, స్థానిక మోడల్‌స్కూల్‌కు 32 పాఠశాలలకు క్రీడా సామగ్రి మంజూరుకాగా, ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు.

స్వామినాథన్ మృతి తీరని లోటు

నంద్యాల(వ్యవసాయం): వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి భారత దేశ వ్యవసాయ రంగానికి తీరని లోటని విశ్రాంత అంతర్జాతీయ శాస్త్రవేత్త, నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారుడు డాక్టర్ ఖాదరబాద్ రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేశారన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే వరి రకాలను అభివృద్ధి చేయడంలో స్వామినాధన్ కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, కార్యదర్శి కృష్టారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్, జాషువా జయంతి



ఆళ్లగడ్డలో భగత్ సింగ్, జాషువా చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్, నవయుగ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ వెంకటరాముడు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి అన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మహమ్మద్ ఆరీఫ్, నబిరసూల్, కిరణ్‌కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణధ్ యాదవ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంబాబు, సతీష్, బాషా, కిరణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవి జాషువా

నంద్యాల(వ్యవసాయం): సామాజిక చైతన్యం కోసం అక్షరాస్త్రాలు సంధించిన అభ్యుదయ కవి గుర్రం జాషువా అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అన్నారు. పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం నంద్యాల ఎన్‌జీఓస్ హోంలో మానవతావాది జాషువా అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పట్టణంలోని పలు సాహితీ సంస్థల ప్రతినిధులు, సాహిత్య అభిమానులు, ఉపాధ్యాయులు జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం తెలుగు సాహితీ క్షేత్రంలో నంద్యాల కీర్తిని ఇనుమడింపజేస్తున్న కొప్పుల ప్రసాద్‌ను, రంగస్థల రంగంలో మేటీగా నిలిచిన గాయకుడు నరసింహులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మణిశేఖర్‌రెడ్డి, హుసేన్‌రెడ్డి, లింగస్వామి, ఎంఈఓ రామసుబ్బయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో..

అరసం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని భగత్‌సింగ్ గ్రంథాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అరసం అధ్యక్షుడు ముర్తుజా, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, శంకరయ్య, మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

నంద్యాల(అర్బన్): బిల్లు ఇచ్చిన తేదీ నుంచి 14రోజుల్లోగా బిల్లు చెల్లిస్తే అపరాధ రుసుం ఉండదని, సకాలంలో విద్యుత్ చార్జీలు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని విద్యుత్ శాఖ డీఈ ఆంథోనిరాజు గురువారం కోరారు. ఆన్‌లైన్, గూగుల్, పేటీఎం తదితర వాటి ద్వారా విద్యుత్ చార్జీలు చెల్లించవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా చెల్లింపులు చేయనివారికి అపరాధ రుసుముతో పాటు విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తామని హెచ్చరించారు.

లోకేష్ ఢిల్లీకి పరారు కావడం సిగ్గుచేటు

నంద్యాల(అర్బన్): టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌లో 14వ నిందితుడిగా ఉన్న నారా లోకేష్ ఢిల్లీకి పరారు కావడం సిగ్గుచేటని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండగా, ఆయన తనయుడు ఇన్నర్ రింగ్‌రోడ్డులో నిందితుడిగా తేలడంతో రాష్ట్ర ప్రజలు అసహించుకుంటున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు.

భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లు ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: పట్టణంలో భారీ శబ్దాలు చేస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 59 సైలెన్సర్లను గురువారం సాయంత్రం ధ్వంసం చేసినట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్టేషన్ సమీపంలోని టౌన్‌హాల్ మైదానంలో సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకూ సైలెన్సర్లను మార్చి భారీ శబ్ధాలు చేసే వాహనాలను పట్టుకనేందుకు ఈ నెల స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఇందులో 59 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి సైలెన్సర్లను సీజ్ చేశామని చెప్పారు. ఇకపై భారీ శబ్దాలుచేసే వాహనాలకు భారీగా జరిమానాలు విధిస్తామని చెప్పారు. సీఐ ఇస్మాయిల్, ఎస్సై నజీర్ తదితరులు ఉన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించాలి





నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, చాగలమర్రిలో మహమ్మద్‌ప్రవక్త తలనీలాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించి ప్రేమ, శాంతిలను పంచాలని సాహెబ్ మసీదు నిర్వాహకులు సయ్యద్ కరీముల్లా హుసేన్, అసదుల్లా అర్కొన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని పట్టణంలో మిలాద్- ఉన్- నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాహెబ్ మసీదు నుంచి ప్రవక్త బోధనలను స్మరిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం సాహెబ్‌మసీదు, నంద్యాల ఖాజీ సంధానీ నివాసంలో మహమ్మద్ ప్రవక్త తలనీలాలను, ఆయన వాడిన కంబళిని భక్తుల దర్శనార్థం ప్రదర్శించారు. ముబాకర్ నంద్యాల ముస్లిం యూత్ ఆధ్వర్యంలో యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హుసేని, సయ్యద్ షబుద్దీన్ హుసేని, తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో ముస్లింలు గురువారం మిలాద్-ఉన్-నబి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామియా మస్జిద్ సమీపంలోని ఆసారే-షరీఫ్‌లో మహమ్మద్ ప్రవక్త తలనీలాలను ప్రదర్శించారు. స్థానిక బుగ్గ రస్తా వీధికి చెందిన ప్యారేభాయి గారి షరీఫ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజీ లాలుమియ్య ఖాద్రీ, ఖాజీ ఖాజాపీర్, ఖాజీ ఖమ్రురుద్దీన్, ఖాజీ ఖలీల్, ఖాజీ గౌస్ పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. గురువారం మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకొని జమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీరత్ క్విజ్ పోటీ కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర విశేషాలను, బోధనలను, ప్రవచనాలను అందరికీ అందించాలనే సంకల్పంతో క్విజ్ పోటీలను నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. జమాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు జమాన్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుంచి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని, అక్టోబర్ 14న ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అప్లికేషన్లు, హాల్‌టికెట్లు కావాల్సిన వారు అభ్యుదయ పాఠశాల, నూనెపల్లె నవభారత్ హైస్కూల్ పాఠశాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నవభారత్ హుసేన్, రవీంద్రనాథ్, అబ్దుల్లా, ఇసాక్‌బాషా, ఖాజాహుసేన్, హుసేన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

కానాలలో ప్రారంభమైన సర్వే



మహిళకు బీపీ పరీక్ష చేస్తున్న సీహెచ్‌ఓ గ్రేసి

నంద్యాల(అర్బన్): మండల మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. సీహెచ్‌ఓ గ్రేసి, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు లక్ష్మీప్రసన్నలతో పాటు గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులతో పాటు అక్టోబర్ 17న జరిగే వైద్యశిబిరానికి టోకెన్లను అందించారు. మెడికల్ ఆఫీసర్లు కాంతరావునాయక్, గోపాల్‌ల పర్యవేక్షించారు.

ముమ్మరంగా సర్వే

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలో ఇంటింటా సర్వే ముమ్మరంగా సాగుతోంది. గురువారం ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పడిగెపాడు, హరివరం గ్రామాలలో ఏఎన్‌ఎమ్‌లు, ఆరోగ్య సిబ్బంది గృహాల వద్దకు వెళ్లి రోగుల విషయాలను అడిగి తెలుసుకుని ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

15 నుంచి మహానందిలో ఉత్సవాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానంది ఆలయ వేదపండితులు రవిశంకర అవధానితో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ దసరా నవరాత్రుల్లో జరిగే పూజల్లో భక్తులు రూ. 13వేలు టికెట్‌తో ఉభదాతలుగా పాల్గొనవచ్చన్నారు. ఉత్సవాల్లో భాగంగా 15న శ్రీ శైలపుత్రి దుర్గ, 16న శ్రీ బ్రహ్మచారిణీ దుర్గ, 17న శ్రీ చంద్రఘంట దుర్గ, 18న శ్రీ కూష్మాండ దుర్గ, 19న శ్రీ స్కందమాత దుర్గ, 20న శ్రీ కాత్యాయినీ దుర్గ, 21న శ్రీ కాళరాత్రి దుర్గ, 22న శ్రీ మహాగౌరీ దుర్గ, 23న శ్రీ సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో శ్రీ కామేశ్వరీ అమ్మవారికి నిత్యం పూజలు, వాహనసేవలు ఉంటాయన్నారు.

డి.కొత్తపల్లెతో నీటి సమస్య లేదు



భవనాసి వాగుపై నిర్మించిన వంతెన



ఓజీ తండాలో నిర్మించిన సీసీ రోడ్డు

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట పంచాయతీ మజరా గ్రామమైన డి.కొత్తపల్లె గ్రామంలో సాగు, తాగునీరు పుష్కలంగా ఉన్నాయని గ్రామ సర్పంచ్ బాలీశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ బీజేపీ నాయకులు బుధవారం డి.కొత్తపల్లె గ్రామంలో పల్లె నిద్ర పేరుతో పర్యటించి అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య ఉందనడం విడ్డూరంగా ఉందన్నారు. కొళాయిల ద్వారా పుష్కలంగా నీరు సరఫరా అవుతున్నాయని చెప్పారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణాలకు రూ.20 లక్షల గడప గడప, ఎన్‌ఆర్‌ఆర్‌జీఎస్ నిధులను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణానికి కావలసిన ఇసుక, కంకర, సిమెంటు సిద్ధంగా ఉందని వర్షం రావడంతో పనులు ప్రారంభించలేదని చెప్పారు. అలాగే ఓ.జి.తాండాలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో డి.కొత్తపల్లెలో బోరు, మోటారు, పైప్‌లైన్ నిర్మాణం చెపట్టడం జరిగిందన్నారు. చెంచుగూడెం వెళ్లే రహదారిలో భవనాసి వాగుపై రూ.4.80 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం బీజేపీ నాయకుల కళ్లకు కనబడలేదా? అని ఆయన మండిపడ్డారు. కళ్లు నెత్తిన పెట్టుకొని గ్రామంలో సదర్శించారా? అని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో బంగారు పతకం



నిర్వాహకుల నుంచి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పవన్‌రెడ్డి

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు మజరా గ్రామమైన మూడురాళ్లపల్లె గ్రామానికి చెందిన పవన్‌రెడ్డి 3వ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ గ్రాప్లింగ్ సినియర్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించాడు. గ్రామానికి చెందిన రైతు సుదర్శన్‌రెడ్డి కుమారుడు పవన్‌రెడ్డి రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ బ్రాంచ్ చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఈ నెల 23, 24 తేదీల్లో విశాఖ జిల్లా, మధురవాడలో గ్రాప్లింగ్ కమిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ రాష్ట్ర గ్రాప్లింగ్ మరియు వ్రెస్టిలింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెలుచుకున్నాడు. పవన్‌రెడ్డిని నంద్యాల జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు షేక్.బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు అభినందించారు.

ఐడియా అదిరింది !



ఉమాపతినగరం కుంటలో తేలాడుతున్న పాతబాటిళ్లు

దొర్నిపాడు: ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న నీటి కుంట మండలంలోని ఉమాపతినగరం లోనిది. కుంటలో ఎక్కడ చూసినా నీటిబాటిళ్లు తేలాడుతున్నాయి. ఎందా అనీ ఆరాతీస్తే ఆశ్చర్యం కలుగక మానదు. గ్రామం పుట్టి సుమారు ఐదు దశాబ్దాలు అవుతుంది. అప్పట్లో నీటి అవసరాలకు కుంటను తవ్వుకున్నారు. కానీ నేటికీ ఆ కుంటనీటినే గ్రామస్తులు ఇంటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గతంలో అయితే తాగేందుకు కూడా ఈ నీటినే తెచ్చుకునేవారు. ప్రస్తుతం ఆర్థికంగా అందరూ అభివృద్ధి చెందడంతో ఇంటింటికీ మోటార్ తెచ్చుకున్నారు. ఇంకేముంది ఊరంతా కుంటనీటిని మోటారు ద్వారా పంపింగ్ చేసుకుంటున్నారు. కానీ మోటార్ పైపు కుంటలోని పూడులో కూరుకోకుండా పైపునకు ఖాళీబాటిల్‌ను కట్టడంతో తేలాడుతుంది. అలాగే ఏదైనా సమస్య వస్తే ఫలానా కలర్ బాటిల్ కల్గిన పైపు తమది అని గుర్తు పట్టేందుకు వీలుగా ఉంటుందని అంటున్నారు గ్రామస్తులు. ఇలా కుంట నిండా బాటిళ్లు ఉండటంపై ఆరా తీస్తే ఇదీ సంగతీ అని తెలిసింది.